క్లుప్తంగా

రేపటి నుంచి ఆటో మ్యూటేషన్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు ఒకటి నుంచి ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు చేయనుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఆస్తులకు ఆటో మ్యూటేషన్‌ని రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ విధానాన్ని ఇప్పటికే విజయవాడలో అమలుచేయగా అక్కడ సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలోనూ ఆగస్టు ఒకటి నుంచి ఆస్తులకు ఆటో మ్యుటేషన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఆస్తులకు ఆటోమ్యుటేషన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి కావటంతో పాటుగా సమయం కూడా ఆదా అవుతుందన్నారు.

వ్యక్తిపై దాడి

పట్నంబజారు: వ్యక్తిపై దాడి చేసిన గాయపరిచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. షాపు ఎంప్లాయిస్ కాలనీలో నివాసం ఉండే మద్దినేని నాగేశ్వరరావు, నంది వెలుగురోడ్డులోని వస్త్రలత కాలనీలో వేంచేసి యున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో వజ్రాల కోటిరెడ్డి గతంలో రూ.60 వేలు గుడి అభివృద్ధి నిమిత్తం ఇచ్చారు. తాను ఇచ్చిన డబ్బులకు సంబంధించి ఏం అభివృద్ధి చేశారనే అంశంపై మంగళవారం ఇరువురూ మధ్య ఆలయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీనితో కోటిరెడ్డి, అతడి బంధువులు నాగేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు నిమిత్తం పర్మిషన్‌కు కోర్టుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల గుండెకు లలిత హాస్పిటల్ అండ

డాక్టర్ రాఘవ శర్మ



గుంటూరు మెడికల్: గుండె నొప్పి వచ్చిన తరువాత కంటే రాకముందు ఆహారపు అలవాట్లలో కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే మంచిదని, అందువల్ల ప్రతి ఒక్క జర్నలిస్టు తన ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ముందు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు, లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్– లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రాఘవ శర్మ అన్నారు . గుంటూరు కొత్తపేట మల్లయ్య లింగభవన్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) నగర కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టు రాయితీ హెల్త్ కార్డు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డాక్టర్ రాఘవ శర్మ జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడుతూ వాస్తవాలును నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్ళి రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడుతూ ఆరోగ్యాన్ని మరిచి పోతున్నారని, మీ ఆరోగ్యంపై ముందుస్తు జాగ్రత్తలతో ఉండాలని సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్యం రాయితీ ఇచ్చే విషయం ఎల్లప్పుడూ మీకు అండగా లలిత హాస్పిటల్ ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ రాఘవశర్మని నగర కమిటీ అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, కార్యదర్శి ఫణి కుమార్, కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు మీరా, జిల్లా కార్యదర్శి కె.రాంబాబు, ఐజేయూ సభ్యుడు గిరిధర్ పాల్గొన్నారు.

నిసార్ శాటిలైట్ ప్రయోగం అద్భుత ఘట్టం

ప్రముఖ శాస్త్రవేత్త చందు సాంబశివరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ అంతరిక్ష, భౌగోళిక పరిశోధనల్లో అద్భుత విజయాలకు నిసార్ శాటిలైట్ ప్రయోగం నాందిగా మారనుందని ప్రముఖ ఇస్రో, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్, ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో కోపల్లి జయకర్ బాబు మోడరేటర్‌గా 'అంతరాలు తొలగించు అంతరిక్షం' బ్యానర్‌పై ఏ గేమ్ చేంజర్ శాటిలైట్– నిసార్ అనే అంశంపై బుధవారం జూమ్ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందు సాంబశివరావు మాట్లాడుతూ నిసార్ అంటే నాసా ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్‌ను జియో సింక్రనస్ లాంచింగ్ వెహికల్ రాకెట్ ద్వారా 2.392 కేజీల బరువైన ఉపగ్రహాన్ని శ్రీహరి కోట నుంచి విజయవంతంగా ప్రయోగించారని తెలిపారు. కార్యక్రమంలో స్పేస్ కిడ్స్ ఇండియా సీఈఓ కె.శాని, భౌతిక శాస్త్ర అధ్యాపకుడు వారణాసి దుర్గాప్రసాద్, కిడ్స్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కేశాని, భైరిశెట్టి మల్లికార్జునరావు, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ లెనిన్ బాబు, కవి, రచయిత కాపిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల సందర్శన

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం సేంద్రియ వ్యవసాయ క్షేత్రాల క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఐకార్ అటారి జోన్ డాక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం దత్తత గ్రామమైన జొన్నలగడ్డలో క్షేత్ర పరిశీలనలో భాగంగా సేంద్రీయ వ్యవసాయం వరి పొలాన్ని సందర్శించటం జరిగిందన్నారు. సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్న రైతులందరిని ఒక ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌గా ఏర్పాటు చేసి వారందరికీ సర్టిఫికేషన్ నిర్వహించి, మార్కెటింగ్ కెవికె ద్వారా కల్పిస్తామని తెలిపారు.

మోసం- చంద్రబాబు అన్నదమ్ములు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



స్కానర్లు ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, పార్టీ నేతలు

పట్నంబజారు: చంద్రబాబు, మోసం అన్నదమ్ములని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గంలోని 22వ డివిజన్ శ్రీనివాసరావుపేటలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు గెదెల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నిర్దేశించిన స్కానర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబుకు దగా చేయడం తొలి నుంచి పరిపాటేనన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు ఏఒక్క పథకమైనా తాను ప్రవేశపెట్టానని చెప్పుకోగలడా అని ప్రశ్నించారు. మ్యానిఫెస్టో అంటే ఒక పవిత్ర గ్రంథంగా భావించి మహోన్నత వ్యక్తి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు మ్యానిఫెస్టోను చెత్త బుట్టలో పడేస్తారని మండి పడ్డారు.

ప్రతిపక్ష నేతపై ఆంక్షలు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్తుంటే లేని ఆంక్షలు పెట్టి కేవలం ఉద్దేశపూర్వకంగా కూటమి ప్రభుత్వం ఆయన్ను ఇబ్బందులకు గురిచేస్తుందని అంబటి ధ్వజమెత్తారు. ఎవరెన్ని అడ్డంకులు పెట్టి, ఎన్ని బందోబస్తులు పెట్టిన వైఎస్ జగన్‌కు ఉన్న ప్రజాభిమానాన్ని నిలువరించలేరన్నారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వాస్తవాలను వివరిస్తున్నట్లు చెప్పారు. సూపర్ 6 అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు, అవి నెరవేర్చలేని పరిస్థితి గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం పార్టీ నేతల నుంచి కార్తలపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్, డివిజన్ కార్పొరేటర్ నాగమణి, పార్టీ నేతలు టింబర్ డిపో జానీ, మాలకొండారెడ్డి, సయ్యద్‌జానీ, స్టార్ మస్తాన్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించే వరకు ఉద్యమం ఆగదు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్న జంగాల అజయ్‌కుమార్, వామ పక్ష పార్టీ నాయకులు

లక్ష్మీపురం: అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు పాతగుంటూరులోని అంకమ్మ తల్లి దేవాలయం వద్ద నుంచి బుధవారం సాయంత్రం వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచార, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి అరుణ్ కుమార్ అధ్యక్షత వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ . కేంద్ర ప్రభుత్వం మెప్పు కోసం ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై స్మార్ట్ మీటర్ల భారాన్ని మోపుతున్నారని వేల కోట్ల రూపాయలు అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చే పనిలో ఎన్డీఏ కూటమి ఉందన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ప్రకటన ఇవ్వడం అత్యంత హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు మేడా హనుమంతరావు, కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు, జంగాల చైతన్య, అరుణ్ కుమార్, బన్నీ, అజయ్, జి.లక్ష్మి, చెవుల పున్నయ్య, జగన్నాథం, రాయల వెంకటేశ్వర్లు, కట్ట శ్రీనివాస్, రాగం చంద్రమౌళి, నూతలపాటి చిన్న,నికల్సన్, శ్రీనివాసు, అరుణ,మేకల రవి, నరసింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుజ్జనగుళ్లలో...

లక్ష్మీపురం: ప్రజలపై భారం మోపే విధంగా ప్రభుత్వం విద్యుత్ విధానాలు అమలు చేస్తోందని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, సీపీఎం నగర కార్యదర్శి నళిని కాంత్ విమర్శించారు. గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్లలో స్మార్ట్ మీటర్ల రద్దు, అధిక విద్యుత్ చార్జీల తగ్గింపు, ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించాలంటూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ఇళ్లలో బిగించొద్దని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో చేసి చూపించాలని కోరారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకునే వరకు పోరాటం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, కమిటీ సభ్యులు జంగాల చైతన్య, చల్ల మరియదాసు, వి.వెంకటేశ్వర్లు, ఎస్.చిన్న, రామచంద్రుడు, ధూపాటి వెంకటరమణ, జగన్నాథం, ఏఐఎస్ఎఫ్ నాయకులు బన్నీ, వెంకట్, అజయ్, అంజి నాయక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

సంఘం గౌరవాధ్యక్షులు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం గౌరవాధ్యక్షులు

లక్ష్మీపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం విషయంలో తగిన శ్రద్ధ చూపించడం లేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రమణ అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలకు 42 రోజులు పాటు నిరవధిక సమ్మె నిర్వహించిన సందర్భంగా 2024 జూలైలో అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని నాటి ప్రభుత్వం రాత పూర్వక ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. ఆ గడువు దాటి ఏడాది గడిచినా ప్రభుత్వం అంగన్‌వాడీల జీతాల పెంపుదల విషయంలో స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల పని ఎక్కువ సమయం సెల్ ఫోన్‌ల యాప్‌లపై పని చేయడమే సరిపోతుందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు 90శాతం పైగా పనిచేయడం లేదని చాలా ప్రాంతాలలో నెట్ కనెక్టివిటీ సరిగా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీన జిల్లాలోని అంగన్‌వాడీలందరూ తమ ఫోన్లను సీడీపీఓలకు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరిగిపోతున్నా అంగన్‌వాడీల మెనూ చార్జీలు మాత్రం పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలపై ఇది తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతుందని వివరించారు. గ్రాట్యుటీ అమలు చేస్తూ జీఓ ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించారని ఆ జీఓ ఇంతవరకు ఒకరికి కూడా అమలు చేయలేదని ఆరోపించారు. సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు అర్హత కలిగిన అంగన్‌వాడీలు అనేకమంది ఉన్నా తల్లికి వందనం, పెన్షన్ తదితర సంక్షేమ పథకాలు వారికి వర్తింపజేయడం లేదని చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్లు ,హెల్పర్లందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషన్ కార్డులలో చేర్పులు, తొలగింపులకు అవకాశం ఇస్తున్నట్టు ప్రకటించినా అనేక మంది అంగన్‌వాడీల కుటుంబ సభ్యులతో సహా ఇతరులకు కూడా రేషన్ కార్డుల మార్పులు చేయడం లేదన్నారు. సమావేశంలో సంఘం సెక్టార్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మేరీ గోల్డ్, కార్యదర్శిగా చిన్న వెంకాయమ్మ, కమిటీ సభ్యులుగా మస్తానీ, రాజకుమారి, బి.నవరత్నాలు ఎన్నికయ్యారు.

ఐదు నామినేషన్లు దాఖలు


నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు మొదటి రోజైన బుధవారం ఐదు నామినేషన్లు దాఖలు అయినట్లు నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. నామినేషన్లలో వైస్ ప్రెసిడెంట్‌కి ఒక నామినేషన్, జాయింట్ సెక్రటరీకి 2 నామినేషన్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు 2 నామినేషన్లు వచ్చాయని వివరించారు.

సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీలు పునరుద్ధరించాలి



లక్ష్మీపురం: కరోనా సమయంలో ఆర్థిక భారంతో పేరుతో నిలిపివేసిన సీనియర్ సిటిజన్స్ రాయితీలను రైల్వే శాఖ పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ కరోనా మహమ్మారి కారణంగా 2020లో కేంద్ర తాత్కాలికంగా నిలిపి వేసిన రైల్వే రాయితీలను కరోనా తగ్గు ముఖం పట్టి ఏళ్లు గడుస్తున్నా ఆ రాయితీలను పునరుద్ధరించక పోగా శాశ్వతంగా రద్దు చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి పి.భావన్నారాయణ మాట్లాడుతూ బ్రిటన్, కెనడా, జర్మనీ, జపాన్ దేశాలు వృద్ధుల ప్రయాణ అవసరాలను గుర్తించి ప్రత్యేక రాయితీలను కొనసాగిస్తున్నారని చెప్పారు. కేంద్రం ఇప్పటికైనా స్పందించి రాయితీలను పునరుద్ధరించాలన్నారు.

వైభవంగా ప్రారంభమైన సంగీత నృత్యోత్సవాలు



సుమతి రామమోహనరావుకు మృదంగ నందిని బిరుదు ప్రదానం చేస్తున్న

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై సంగీత నృత్యోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దాస సాహిత్య ప్రాజెక్ట్, టీటీడీ, శ్రీకంచి కామకోటి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ న్యూఢిల్లీ(తిరుపతి రీజియన్), ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ (తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల మూడో తేదీ వరకు నిర్వహించనున్నారు. అనంతరం భరత కళాక్షేత్ర(తిరుపతి) నృత్యోపాసన (భరత నాట్య ప్రదర్శన) నృత్య శిరోమణి ముత్తురేవుల శ్రీనివాసరావు, నాట్య శిల్పి నీలం ధనశ్రీ శ్రీనివాస్ నిర్వహణలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. హరి శ్రీనిత, సాధనపాటి మనస్విని, తన్మయి, ఏబీ తిశ్యశ్రీనిహిత, ఏఎస్ శ్రీవైష్ణవి, శ్రీజ నాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం ఉపకులపతి జీఎస్ఆర్ కృష్ణమూర్తి, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు, తిరుపతి అవధాన కీర్తి కౌముది డాక్టర్ మేడసాని మోహన్, ఆలయ పాలకమండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ తిరుపతి రీజియన్ ఆర్‌డీ డాక్టర్ కేటీవీ రాఘవన్, సంగీత విదుషీమణి డాక్టర్ ద్వారం లక్ష్మి, మండలి సంయుక్త కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు ప్రసంగించారు. సభానంతరం ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ప్రముఖ మృదంగ విద్వాంసులు దండమూడి సుమతి రామమోహనరావుకు మృదంగ నందిని బిరుదు, కొమ్మజ్యోస్యుల సద్గురు చరణ్‌కు తాళావధాన పంచావన బిరుదు ప్రదానం చేసి సత్కరించారు.

గణనీయంగా పెరిగిన మల్లేశ్వర స్వామి ఆదాయం

- పెదకాకాని శివాలయములో కానుకల హుండీలు లెక్కింపు పూర్తి
- 120 రోజులు హుండీ ఆదాయం 64,92,250 రూపాయలు

పెదకాకాని: శివాలయంలో మల్లేశ్వరస్వామి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో బుధవారం హుండీలు తెరచి కానుకలు లెక్కించారు. దేవాదాయశాఖ వారి ఆదేశాల మేరకు ఈ హుండీల కానుకలు లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా గుంటూరు జిల్లా జేవీఓ, ఏసీ సైదమ్మబాయి హాజరయ్యారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటలకు ఆలయంలోని హుండీలు తెరచి కానుకలు ఆలయ కళ్యాణమండపంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 4 గంటల వరకూ జరిగిన లెక్కింపు కొనసాగింది. ఈ హుండీల ద్వారా 120 రోజులకు గాను కానుకల హుండీల ద్వారా 64,92,250 రూపాయలు ఆదాయం లభించినట్లు డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు. అలానే అన్నప్రసాద వితరణ హాల్‌లోని హుండీ ద్వారా 3,13,782 రూపాయలు సమకూరిందన్నారు. హుండీల ద్వారా బంగారం 63.5 గ్రాములు, (63గ్రాముల 500మిల్లీ గ్రాములు), వెండి 795 గ్రాములు, విదేశీ కరెన్సీ 623 అమెరికన్ డాలర్లు ఆదాయం సమకూరినట్లు డీసీ తెలియజేశారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, కెనరా బ్యాంక్ సిబ్బంది, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. పెదకాకాని పోలీసులు లెక్కింపు ప్రదేశములో బందోబస్తు పర్యవేక్షించారు.

నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి



నెహ్రూనగర్: నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ప్రభుత్వానికి విన్నవించారు. మంగళవారం రాత్రి నగరంలో బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్‌లో నాయీబ్రాహ్మణ రాష్ట్ర ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితిగా హాజరైన జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ వెనుకబడిన కులాల్లో నాయీ బ్రాహ్మణ కులం ఒకటని గతంలో కొంత మందికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి నాయీ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ ఇవ్వలేదన్నారు. ఈ సమాజానికి సేవ చేస్తున్న వారికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఉద్యమాల ఉపాధ్యాయులు ఉ.సాంబశివరావు(ఉసా) చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు కర్పూరి ఠాకూర్, రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు పాల్గొన్నారు.

రాజధాని గ్రామాల్లో జోరుగా జూదం

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పందెం కోడి తొడకొడుతోంది. అధికారులు, పోలీసులు నిఘా విభాగం నిద్రపోతుండటంతో యథేచ్ఛగా కోడిపందేలు, పేకాట నిర్వహణ జోరుగా కొనసాగుతోంది. అధికార పార్టీకి చెందిన వ్యక్తులతోపాటు, గుంటూరు, మంగళగిరి, విజయవాడ, అమరావతి, సత్తెనపల్లి, తెనాలి ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు పందెంలో, పేకాటలో పాల్గొంటూ రూ. లక్షలు పోగొట్టుకుంటున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథులే కనిపించడం లేదు.

పందెం రాయుళ్ల క్యూ..

29 గ్రామాల పరిధిలోని తుళ్లూరు మండలం నెక్కల్లు, వడ్డమాను, పెదపరిమి, శాఖమూరు, తుళ్లూరు, వెకంట్రాయనిపాలెం, ఉద్దండరాయునిపాలెం, లంక, మంగళగిరి రూరల్ మండలం నీరుకొండ, తాడికొండ మండలం మోతడక, కంతేరు, నిడుముక్కల, పాములపాడు, బండారుపల్లి, పలు గ్రామాల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. దీనిపై ఆయా విభాగాలకు చెందిన పెద్దలకు భారీగా ముడుపులు ముట్టజెబుతున్నామని, నిర్వాహకులు అభయం ఇస్తుండటంతో విజయవాడ, తదితర ప్రాంతాలకు చెందిన పందెం రాయుళ్లు క్యూ కడుతున్నారు. రోజూ యథేచ్ఛగా ఈ తంతు కొనసాగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువత లక్ష్యంగా కోడిపందేలు భారీగా కొనసాగుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ డే



చిన్నారులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి తదితరులు



ర్యాలీలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం పర్యావరణ పరిరక్షణ చాటుతూ గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రీ- ప్రైమరీ చిన్నారులు, ఉపాధ్యాయులు ఆకుపచ్చని రంగు వస్త్రాలను ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ మొక్కలు నాటి, చెట్లను పెంచడం వలన కలిగే ప్రయోజనాలతో పాటు చెట్లను నరికివేయడం వలన వాటిల్లే అనర్థాలను చిన్నారులకు తెలియజేసేందుకు కార్యక్రమం చక్కటి ప్రేరణగా నిలుస్తుందన్నారు. పర్యావరణ, పచ్చదనం అనేది మానవుని మనుగడతో ముడిపడి ఉందని, పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం చిన్నారులు ఆయా అంశాలపై ర్యాంప్ వాక్, డ్యాన్స్‌లతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ, ప్రీ-ప్రైమరీ కో-ఆర్డినేటర్లు దిల్ జహాన్, టి. శ్రీదేవి, ఇన్‌చార్జి కె.హరిప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ దిశగా ముందుకెళ్లాలని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం జానకి రామిరెడ్డి తెలిపారు. స్థంభాలగరువులోని నారాయణ పాఠశాల విద్యార్థులు బుధవారం పర్యావరణ పరిరక్షణ చాటుతూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన జానకి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలోని అన్ని వర్గాలు విచ్చల విడిగా కాలుష్యానికి కారకులవుతున్నారని, భావితరాలకు ఇది శాపంగా పరిణమించరాదన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు సమాజంపై అవగాహన కల్పించడం బాధ్యతగా భావిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌స్కిల్ శిక్షకురాలు ప్రహర్షిణి, ఏవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఎమర్జెన్సీ మెడిసిన్ ట్రాలీలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ



ఎమర్జెన్సీ ట్రాలీలను చూపిస్తున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: అత్యవసర చికిత్సల కోసం వచ్చే రోగులకు ఎమ్మారై, సీటీస్కాన్, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేయించేందుకు రోగిని ఆయా పరీక్షల గదుల వద్దకు తీసుకెళ్లేందుకు రోగుల సహాయకులకు చాలా ఇబ్బంది కలుగుతోంది. రోగుల సహాయకులతోపాటు, ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది కూడా వైద్య పరీక్షలు చేయించేందుకు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుంది. ఇక నుంచి ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా క్యాజువాల్టిలో అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులకు పడకపైనే అన్ని రకాల వైద్య పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం ప్రత్యేకంగా ఎమర్జెన్సీ ట్రాలీలను బుధవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. రిసాసిడేషన్ స్ట్రక్చర్లు, మ్యాట్రిస్లు ఎమర్జెన్సీ రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా అత్యవసరంగా వచ్చే పేషెంట్లకు ఇంటిబేషన్, కార్డియాక్ మసాజ్, సీపీఆర్ మొదలకు వైద్య సదుపాయలు రోగిని ఎక్కడకు తరలించకుండానే స్ట్రక్చర్ పైన చికిత్స చేసే వెసులుబాటు కల్పించారు. తద్వారా అత్యవసర విభాగంలోని రోగులకు మెరుగైన వైద్యాన్ని లభిస్తుంది. నూతన స్ట్రక్చర్లు ఎమర్జెన్సీ వార్డులో అందుబాటులోకి తీసుకొచ్చాని డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. తాను సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని బలోపేతం చేశామని, అందులో భాగంగా వెంటిలేటరు, ఇతర వైద్య పరికరాలు అందుబాటులోకి తెచ్చి, వైద్య సిబ్బందిని నియమించామన్నారు. అత్యవసర సేవల కోసం వచ్చేవారికి 24 గంటలూ అందుబాటులో వైద్యులు, సిబ్బందిని ఉంచామన్నారు. వీటిని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి వి రావు, ఎమర్జెన్సీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధిక రాణి, బయో మెడికల్ ఇంజనీర్ కంచర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.